క్లుప్తంగా

9న అవయవదానంపై అవగాహన సదస్సు

అనపర్తి: ఈ నెల 9న జీబీఆర్ విద్యా సంస్థల సెమినార్ హాల్‌లో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీతేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి తేతలి నారాయణరెడ్డి సోమవారం తెలిపారు.

స్పందనకు నాలుగు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు నాలుగు అర్జీలు అందజేశారు.

నేడు బహిరంగ సభ

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు టీడీపీ నేత చంద్రబాబు బహిరంగ సభ జరుగుతుందని ఆ పార్టీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి తెలిపారు. చంద్రబాబు ఉదయం సీతానగరం మండలం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి, అనంతరం కోరుకొండ వస్తారన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ గత నెల 27 నుంచి ఈ నెల 6 వరకూ మండల గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీ నివేదికను ప్రజావేదికలో సమర్పిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రాజానగరం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఒకటి నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. ముందుగా స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లతో ఎంపీడీఓ బి.రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించి, ఈ మాత్రలు వాడే విధానంపై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ వైద్య సిబ్బందికి అవగాహన కలిగించారు. మండలంలో 37 వేల మాత్రలను విద్యార్థులకు వేయనున్నారు. సమావేశంలో పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బెండిక్ట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శరీర దానంపై సదస్సు రేపు

రాజానగరం: స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలోని జనరల్ ఆస్పత్రి, చరక ఆడిటోరియంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు శరీర దానంపై అవగాహన సదస్సు జరుగుతుంది. జీఎస్‌ఎల్ వైద్య కళాశాల, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'మరణానికి అతీతమైన జీవనం – వైద్య విజ్ఞానాల అధ్యయనానికి శరీర దానం' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరి సీతామహలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

పేకాట శిబిరంపై దాడి

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో పేకాట శిబిరంపై దాడి నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమకందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి ఆదిరెడ్డి సత్యనారాయణ, షేక్ కన్నా సాహెబ్, షేక్ ఉమర్‌రఫీలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.1,260 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కామరాజు మాస్టారు మృతికి సంతాపం



కామరాజు మాస్టారు మృతికి సంతాపం తెలియజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రంగంపేట: విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ద్విభాష్యం కామరాజు మాస్టారు మృతికి చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం సంతాపం తెలియజేశారు. కామరాజు మాస్టారు చేసిన సేవలను, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

పెదపూడి: కాండ్రేగుల గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న మూడో వార్డు మెంబర్ స్థానానికి మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన పెదపూడిలో మాట్లాడుతూ కాండ్రేగుల మూడో వార్డు మెంబర్‌గా ఉన్న పేపకాయల వెంకటరమణ రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిందన్నారు. ఆ స్థానానికి ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 14న పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటన, 19వ తేదీన పోలింగ్, ఓట్ల లెక్కింపు జరుగుతాయని తెలిపారు.

పాడి రైతుకు బడి

- పశువుల సంరక్షణపై అవగాహన
- ఆర్బీకేల్లో పశు వైద్య సహాయకుల సేవలు



ఈలకొలనులో పశు విజ్ఞాన బడి నిర్వహిస్తున్న పశు వైద్యాధికారులు

రంగంపేట: అన్నదాతల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం పాడి రైతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించింది. రైతు ముంగిటకు సేవలు అందించేందుకు ఆర్బీకేలను ఏర్పాటుచేసి వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తోంది. పాడి రైతుల అభివృద్ధి కోసం రైతు భరోసా కేంద్రాల్లోనే పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. దీని ద్వారా పశు పోషణ, మెళకువలపై పశు వైద్య సహాయకులు, అసిస్టెంట్లు రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో పశు వైద్య సహాయకులను నియమించి పశు విజ్ఞాన బడి ద్వారా పశు సంపదపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్క రాజమహేంద్రవరం డివిజన్‌లోనే 98 మంది పశు వైద్య సహాయకులు విజ్ఞాన బడులపై అవగాహన కల్పిస్తున్నారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమం ద్వారా పాడి పశువుల పెంపకంలో మెళకువలు, యాజమాన్య పద్ధతులు, పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, కృత్రిమ గర్భధారణపై రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. జీవాలకు టీకాలు వేసే సమయం తదితర వివరాలను పశు వైద్య సహాయకులు వివరిస్తున్నారు.

పాడి రైతులకు రుణ సదుపాయం

కిసాన్ కార్డు ద్వారా రైతులకు ఎలా రుణాలు ఇస్తున్నారో, అలాగే పాడి రైతులకు కూడా కిసాన్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వనున్నారు. పశువుల దాణా, పశుగ్రాసం విత్తనాలు అందిస్తున్నారు. పూర్తి స్థాయి రాయితీతో సంపూర్ణ మిశ్రమ దాణా, పశుగ్రాస విత్తనాలు ఇస్తున్నారు. జిల్లాలో 365 ఆర్బీకేల్లో పాడి రైతులకు రాయితీపై పశువుల దాణా పంపిణీ చేస్తున్నారు. కేజీ రూ.14.50 ఉండగా రాయితీ పోను కిలో రూ.6.50కు అందజేస్తున్నారు. పశుగ్రాస విత్తనాలైన మొక్కజొన్న కిలో రూ.277 ఉండగా రాయితీ పోను రూ.70, జొన్న రూ.437 ధర ఉండగా రాయితీ పోను రూ.110కు అందజేస్తున్నారు.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో పశు సంపద

మండలం	ఆవులు	గేదెలు	మేకలు	గొర్రెలు	కోళ్లు
అనపర్తి	1256	8644	621	2954	21,68,713
బిక్కవోలు	1203	5798	1707	8969	81,95,104
రంగంపేట	7623	11,045	3123	3269	8,73,512
పెదపూడి	10445	2160	29	542	18,489
రాజానగరం	10244	21,327	65,582	6131	40,200
కోరుకొండ	5280	13,074	4903	4969	30,760
సీతానగరం	5194	10,334	4468	3831	28,700
మొత్తం	41,245	72,382	80,433	30,659	1,13,59,478

పశు సంరక్షణపై అవగాహన



పశు సంరక్షణ విజ్ఞానంపై ప్రతి పాడి రైతుకు అవగాహన కల్పించేందుకు ఆర్బీకేల్లో పశు విజ్ఞాన బడులు నిర్వహిస్తున్నాం. వ్యవసాయ పనులకే కాకుండా పాడి సంపదపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్న దాణా, మందులు, గడ్డి కోసే యంత్రాలు, పాలు పితికే యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్‌టీజీ సత్య గోవింద్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

పాడి రైతులకు ఎంతో మేలు



పశువుల పెంపకంపై పాడి రైతులకు పశు విజ్ఞాన బడుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ పశు వైద్యశాలల వద్ద పాడి రైతుల కోసం పశు విజ్ఞాన బడి అమలవుతోంది. మేకలు, గొర్రెలు, పెంపకానికి సంబంధించిన మెళకువలు, పశువులకు వచ్చే వ్యాధుల నివారణ చర్యలను తెలియజేయడం వల్ల పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– ఈదా జాన్‌పాల్, పశువైద్యాధికారి, రంగంపేట మండలం

టెండర్లకు ఆహ్వానం

రంగంపేట: రంగంపేటలో ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీపీసీఎల్ పెట్రోలు బంకు వద్ద ఖాళీగా ఉన్న స్థలాలు, స్టాళ్లలో వ్యాపారం చేసుకోవడానికి ఆసక్తి గల వ్యాపారుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు రాజమహేంద్రవరం ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకూ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ వారి కార్యాలయంలో టెండరు ఫారాలు అందుబాటులో ఉంటాయన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు టెండరు వేయాలని, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరుస్తామన్నారు.

కుంగిపోయిన చెట్టు

సీతానగరం: బొబ్బిల్లంక రేవు వద్ద రక్షణగోడకు లోపల ఉన్న చెట్టు గోదావరి వరద నేపథ్యంలో భూమిలోకి కుంగిపోయింది. గతంలో రేవు వద్ద రక్షణ గోడ నిర్మించారు. దానికి ఇవతలవైపు మొక్కలు నాటారు. అవి ఇప్పుడు పెద్దవయ్యాయి. ఇటీవల గోదావరి వరద ఉధృతంగా వచ్చింది. రక్షణ గోడ కింద భాగం నుంచి భూమి కోతకు గురైంది. గోడకు పదిమీటర్లు దూరంలోకి చెట్టు చుట్టూ నెరలు తీసింది. దీంతో అక్కడకు ఎవ్వరూ వెళ్లకుండా స్థానికులు, రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టారు. కాగా.. ఆ చెట్టు ఒక్కసారిగా కిందకు కుంగిపోయింది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు పరిశీలించారు.

తల్లి పాలకు వెలకట్టలేం



పందలపాకలో జగనన్న పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న నాయకులు



రామవరంలో గర్భిణులకు కిట్లు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: పుట్టిన బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే తల్లిపాలు ఎంతో శ్రేష్ఠకరమైనవని, తల్లి పాలకు వెల కట్టలేమని ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రామవరం సచివాలయంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని గర్భిణులకు సూచించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. రంగంపేట ఐసీడీఎస్ సీడీపీఓ జెస్సీ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే బాలామృతాన్ని ప్రతి బిడ్డకు తినిపించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు రేషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగలక్ష్మి, గొలుగూరి గౌతమి, ఐసీడీఎస్ రామవరం సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.నందీశ్వరి, రామవరం పీహెచ్‌సీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

బిక్కవోలు: మాతాశిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం పందలపాకలోని సొసైటీ కార్యాలయం వద్ద నిర్వహించిన తల్లి పాల వారోత్సవంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు ఇంటికే రేషన్ సరుకులు పంపిణీ చేసే గొప్ప కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలోని ఎంపీటీసీ మచ్చా పాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు ముత్యాలరావు, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

శాఖల వారీ సమీక్షలతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మధురపూడి: స్థానిక కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో వైస్ ఎంపీపీ కొయిడాల స్వర్ణకుమారి అధ్యక్షతన సోమవారం కోరుకొండ మండల సమావేశం నిర్వహించారు. కన్వీనర్‌గా ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ సమావేశాలకు ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరుకావాలన్నారు. ప్రతి సమావేశంలో శాఖల వారీ సమీక్షలతో అభివృద్ధిని సాధించగలమన్నారు. కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధిలో రాష్ట్రంలోనే రాజానగరం నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు. కోరుకొండ మండలాభివృద్ధికి నిరంతర యోధుడిలా ఎమ్మెల్యే జక్కంపూడి కృషిచేస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, పాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. 19 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులిచ్చిన సమాచారం మేరకు కొన్ని అంచనాలు రూపొందించారు. ప్రభుత్వ పథకాలు, అమలు తీరు. అభివృద్ధి కోసం నిర్వహించాల్సిన ప్రణాళికలపై చర్చించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, సర్పంచ్‌ల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు ఎంపీటీసీ సభ్యులు, వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా జగనన్న

పెదపూడి: చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడ్డారని దోమాడ గ్రామ సర్పంచ్ మీనవల్లి శారదదేవి అన్నారు. గ్రామంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలు ఎగ్జిబిషన్ నిర్వహించారు. చేనేత వస్త్రాలు అందరూ వినియోగించాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసుచౌదరి, సచివాలయం కార్యదర్శి ఎస్‌వీవీఎస్ కృష్ణారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ జె.గణేష్, మీనవల్లి సత్తిబాబు, కె.తాతారావు, చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీన ధర్నా

మధురపూడి: కలెక్టరేట్ వద్ద ఈనెల పదిన ధర్నా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాజానగరం నియోజకవర్గం కన్వీనర్ ఏపీఆర్ చౌదరి తెలిపారు. రాష్ట్రంలోని ఆర్థిక స్థితిగతులపై ఆందోళన చేస్తామని తెలిపారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ



గోకవరంలో ర్యాలీ చేస్తున్న ఎరుకుల ఏకలవ్య సంఘం సభ్యులు



కోరుకొండలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

గోకవరం: మణిపూర్ ఘటనను నిరసిస్తూ గోకవరంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరుకుల ఏకలవ్య సంఘం అధ్యక్షుడు కాళ్ల భీమరాజు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు మన దేశ సంస్కృతి, సాంప్రదాయలను కొనియాడుతుంటే మణిపూర్‌లో ఇటువంటి ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు జల్తా నాగరాజు, సెక్రటరీ రావుల మారయ్య, జాయింట్ సెక్రటరీ నక్కా రాజేష్, ట్రెజరర్ మర్రి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని మూడు క్రిస్టియన్ ఫెలోషిప్‌ల ఆధ్వర్యంలో సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ నుంచి సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణ రాజు, ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రాలు అందజేశారు.

కోరుకొండలో..

మధురపూడి: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కోరుకొండలో సోమవారం యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాపవరంలోని పెట్రోలు బంకు నుంచి మెయిన్ రోడ్డు, శివాలయం, బస్టాండ్ సెంటర్, లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన చేశారు. ఆ రాష్ట్రంలో పాలకులకు మంచి బుద్ధి ఇవ్వాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం తహసీల్దార్ పాపారావుకు వినతి పత్రం అందించారు. సంస్థ ఉపాధ్యక్షుడు నక్కా ఆనంద కుమార్, కార్యదర్శి జోయల్ రాజు, ముఖ్య సలహాదారులు ఒరిగేటి ప్రసన్న కుమార్, గౌరవ పెద్దలు పరదేశ్, జ్యోయల్, ఏపీ పరంజ్యోతి పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న సూచించారు. మునికూడలిలోని ఎంపీపీ స్కూల్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానిని చేరడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయురాలు గీత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడెం వద్ద జాతీయ రహదారిపై నడిచి వెళుతున్న వ్యక్తి సోమవారం రాత్రి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆ గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వద్ద ఉన్న సంచిలో ఒక జత బట్టలు ఉన్నాయి. సుమారు 35 ఏళ్ల ఉంటాయని అంచనా వేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని రాజానగరం పోలీసులు పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సాదర స్వాగతం



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గోదావరి ముంపు ప్రాంతాల్లో పర్యటించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలోని హెలిపాడ్ వద్ద పలువురు నేతలు సాదరంగా స్వాగతం పలికారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, దుశ్శాలువాలతో సత్కరించారు.

– రాజానగరం/ అనపర్తి

ఎస్సీ సెల్ విభాగాల అధ్యక్షులు వీరే..



జయరాజ్ | రమణ | చినబాబు | ధనరాజు | అంబటి రాజు | బంగారయ్య

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ (మాల, మాదిగ) అనుబంధ విభాగాలకు అధ్యక్షులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం ప్రకటించారు. రాజానగరానికి జాలెం జయరాజ్ (పల్ల కడియం), కొల్లి రమణ (కొండగుంటూరు), కోరుకొండకు ఈతకోట చినబాబు (జంబూపట్నం), పైడిమల్ల ధనరాజు (గాడాల), సీతానగరానికి అంబటి రాజు (మునికూడలి), చిడిపి బంగారయ్య (చినకొండేపూడి) నియమితులయ్యారు.

350 మందికి వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

సీతానగరం: రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు సత్యం రమేష్ బాబు, రాయుడు శ్రీనివాస్‌లు 350 మందికి వైద్యసేవలు అందించారు. 15 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో స్వామి పరిజ్ఞేయనంద జీ, స్వామి రఘువీరనందాజీ, స్వామి సేవ్యా నందాజీ మహరాజ్, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, కె.శ్రీనివాసరావు, చంటిబాబు, కర్లపూడి గంగన్న, చిట్టెమ్మ పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ శ్రీనివాస్

సీతానగరం: రఘుదేవపురం పీఏసీఎస్ నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. ఆ సొసైటీ వద్ద సోమవారం జరిగిన పాలక మండలి సమావేశంలో చైర్మన్‌గా నిడదవోలు శ్రీనివాస్, పర్సన్లుగా చిట్టూరి శ్రీను, వెలుగుబంట్ల శేషారత్నం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. తమకు బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో మునగాల రామకృష్ణ, ఎంపీటీసీ యలమాటి లలిత శిరీష, పార్టీ నాయకులు పాలచర్ల అచ్యుత రామారావు, గెద్దాడ త్రిమూర్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ అధికారి రాజకుమారి

సీతానగరం: బంగారుకొండ పథకంలోని పిల్లలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ అధికారి నేతల రాజకుమారి తెలిపారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా సీతానగరం పీహెచ్‌సీని సోమవారం ఆమె సందర్శించారు. పిల్లలకు టీకాలు వేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈనెల 10న జరిగే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంపై కార్యాచరణ ప్రణాళికను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఏవీకే చైతన్య, ఎస్.రాజు, మేఘన, సూపర్‌వైజర్ దైవకృప, ఏఎన్ఎం మున్నీషా బేగం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.